సాక్షి
కుమురం భీం
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



బేతల్ పూజలు
కేస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా ఆలయంలో మెస్రం వంశీయులు బేతల్ పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలి రాగా జాతర జనసంద్రంగా మారింది.
II లో▸



వసంతపంచమి వేడుకలు షురూ
బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో ముందుగా గోమాతకు పూజలు నిర్వహించారు. II లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /18.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

పత్తి కొనుగోళ్లు నిలిపివేత
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి, గింజల నిల్వలు అధికంగా ఉండటంతో ఈనెల 3, 4 తేదీల్లో, రెబ్బెన మండలం కొండపల్లి, సిర్పూర్, కౌటాల జిన్నింగ్ మిల్లుల్లో 3నుంచి 5వరకు సీసీఐ కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అష్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి తేదీల నుంచి యథావిధిగా కొనుగోళ్లు కొనసాగుతాయని పేర్కొన్నారు.

టీపీసీ సభ్యుడిగా ఖాండ్రే విశాల్



విశాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: రాష్ట్ర టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు ఖాండ్రే విశాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశాల్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీలో పని చేసే నాయకులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని తెలిపారు. విశాల్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సభ్యుడు గోడం నగేశ్ చొరవతో గత కొన్నేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న తనను గుర్తించి నామినేటెడ్ పదవి కట్టబెట్టారని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, సీనియర్ నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు కృష్ణ కుమారి, సొల్లు లక్ష్మి, ఎలగతి సుచిత్, శ్రవణ్‌గౌడ్, ఇగురపు సంజీవ్, ఈదులవాడ గణేశ్ పాల్గొన్నారు.

బాలకార్మికుల గుర్తింపు
ఆసిఫాబాద్: 11వ విడత ఆపరేషన స్మైల్‌లో భాగంగా జిల్లాలో 57 మంది బాల కార్మికులను గుర్తించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా జనవరి 1 నుంచి 31 వరకు సర్వే చేసి ఆసిఫాబాద్ డివిజన్‌లో 21 మంది బాలురు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 33 మంది బాలురు, ముగ్గురు బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు పేర్కొన్నారు. 14 ఏళ్ల బాలబాలికలను పనుల్లో పెట్టుకోవడం నేరమని, బాలకార్మికులను ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చదువులో రాణించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువులో రాణించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం మండలంలోని గంగాపూర్ కేజీబీవీలో 'బేటీ బచావో బేటీ పడావో' దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ, గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై ఎన్జీవో సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా జిల్లాలోని 12 విద్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యుక్త వయస్సులో శరీరంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బాలికలు పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే ఆరోగ్య కార్యకర్తకు తెలపాలని సూచించారు. రెడ్ ఎక్స్‌ప్రెస్ సంస్థ ప్రతినిధి భాను కల్లూరి, మహిళా శిశు సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, మహిళా సాధికారక జిల్లా కోఆర్డినేటర్ శారద పాల్గొన్నారు.

మధ్యతరగతికి పెద్దపీట

- వేతన జీవులకు తీపి కబురు
- రూ.12లక్షల వరకు పన్ను లేదు
- వ్యవసాయరంగానికి అనుకూలం
- గిగ్ వర్కర్లకు హెల్త్ ఇన్సూరెన్స్
- వృద్ధులకు వడ్డీపై టీడీఎస్ ఊరట
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



సాక్షి, ఆసిఫాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశ పెట్టిన 2025–26 బడ్జెట్‌లో జిల్లాలోని మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట దక్కింది. అలాగే వచ్చే ఏడాది నుంచి పెంచనున్న మెడికల్ సీట్లతో మరికొంత మంది విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి రానుంది. బడ్జెట్‌లో జిల్లా మీదుగా వెళ్లే కొత్త రైళ్ల సమాచారంపై స్పష్టత లేనప్పటికీ, కొత్త పన్ను విధానం ప్రవేశ పెట్టడంతో ఆదాయ పన్ను అధికంగా చెల్లిస్తున్న ఇక్కడి సింగరేణి ఉద్యోగులకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. ఈ సంస్కరణలతో మధ్యతరగతి కొనుగోలు శక్తి పెరగనున్నప్పటికీ, కుడి చేతితో ఇచ్చి ఎడమ చేతి ద్వారా లాక్కునట్లుగా బడ్జెట్ ఉందని రాజకీయ, విద్యార్థి సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

అనేక వర్గాలకు వరాలు

దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులు, వృద్ధులకు టీడీఎస్ పరిమితి, ఎంఎస్‌ఎంఈలకు రుణపరిమితి పెంపు, గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా, కిసాన్ క్రెడిట్ కార్డుల లిమిట్ లాంటి ఉపశమన చర్యలతో కేంద్రం బడ్జెట్‌లో పలు వర్గాలపై వరాల జల్లు కురిపించింది. 36 ఔషధాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తగ్గించడంతో క్యాన్సర్‌తోపాటు దీర్ఘకాలిక, అరుదైన రోగాలకు సంబంధించిన మందులు అందుబాటు ధరల్లోకి రానున్నాయి. దీంతో సామాన్యులకు ఎంతో ఊరట లభించనుంది.

వేతన జీవికి ఊరట

కొత్తపన్ను విధానం ప్రవేశ పెట్టడం ద్వారా మధ్యతరగతి వేతన జీవులకు కేంద్ర ఆర్థిక మంత్రి శుభవార్త చెప్పారు. వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానున్న ఈ పన్ను విధానంతో రూ.12 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే కొత్త పన్ను విధానంలో స్లాబులనూ మార్చారు. గతంలో రూ.15లక్షల ఆదాయం దాటితే 30 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది. కొత్త పన్ను స్లాబుల మార్పులతో రూ.24 లక్షల ఆదాయం దాటిన వారు మాత్రమే 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నత ఆదాయ వర్గాలకు ఈ విధానం ఎంతో లబ్ధి చేకూర్చనుంది.

రైతులకు అండగా..

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అండగా నిలుస్తూ తక్కువ వడ్డీకే సమయానుసారంగా రుణాలు అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా రైతులు పంటల సాగుకు పెట్టుబడులు, అవసరమైనప్పుడు అధిక వడ్డీ రేట్లతో అప్పు చేయాల్సిన అవసరం ఉండదు. ఇది జిల్లా రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది.

జిల్లాలో క్యాన్సర్ సెంటర్

ప్రతీ జిల్లాకు ఒక డేక్ కేర్ క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించింది. రానున్న మూడేళ్ల లోపు ఈ సెంటర్ జిల్లాలో ఏర్పాటు కానుంది. తద్వారా క్యాన్సర్‌ను ముందుగానే నిర్ధారణ చేసుకుంటే మరణాల సంఖ్య తగ్గనుంది.

అంగన్‌వాడీల బలోపేతం

బడ్జెట్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలమ్మ పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని ఆయా కేంద్రాలు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే పాఠశాలల్లో బ్రాడ్ బ్యాండ్ ఏర్పాటు చేయనుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి రానుంది.

రాష్ట్రానికి ప్రాధాన్యత లేదు



ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025–26 బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష కనబడుతోంది. బడ్జెట్ కేటాయింపుల్లో అన్ని రాష్ట్రాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

సామాన్యుల బడ్జెట్



కౌటాల: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామమన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మధ్యతరగతి కుటుంబాలు, సామాన్యులకు అండగా నిలిచేలా ఉంది. అందుకే ఇన్‌కాం ట్యాక్స్ స్లాబు రేట్లను రివైజ్ చేసింది. కొత్తగా ఇన్‌కాం ట్యాక్స్ బిల్లును తీసుకు రానుంది. ఈ బడ్జెట్‌తో దేశంలో వ్యవసాయ రంగంలోనూ పెద్ద ఎత్తున పెట్టుబడులకు ఆస్కారం ఏర్పడింది. పత్తి సాగును ఆధునికీకరించి మెకనైజేషన్ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దాని ద్వారా దిగుబడిని పెంచే కార్యక్రమాలు చేస్తోంది. స్థూలంగా చూస్తే ఒక ప్రోగ్రెసింగ్ బడ్జెట్‌లా ఉంది. ఆర్థిక, సామాజిక సమతుల్యతను పాటించారు.– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

కుడి చేతితో ఇచ్చి..



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి వేతన జీవులకు ఉపశమనం కలిగించేలా ఉన్నా కొత్త పన్ను విధానం కుడి చేత్తే ఇచ్చి, ఎడమ చేత్తో లాగేసుకున్నట్లుగా ఉంది. లోటు బడ్జెట్‌ను ఎలా పూడుస్తారనే విషయంలో కేంద్రం స్పష్టంగా వివరించలేకపోవడం విడ్డూరంగా ఉంది. – కొక్కిరాల విశ్వప్రసాదరావు, డీసీసీ అధ్యక్షుడు

రైతులకు ప్రోత్సాహం



కౌటాల: బడ్జెట్ వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకరంగా ఉంది. కందులు, మినుములను కేంద్రమే కొనుగోలు చేయడం రైతులకు ప్రోత్సాహాన్నిస్తోంది. కిసాన్ క్రెడిట్ కార్డులపై రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం రైతులకు మేలు చేస్తుంది. పత్తికి మరింత మద్దతు ధర పెంచితే బాగుంటుంది.

– ఏ ఈశ్వర్, వీర్దండి, కౌటాల

పేదలను ముంచే బడ్జెట్



కౌటాల: పేదలను నిండా ముంచే బడ్జెట్ ఇది. మద్దతు ధర పెంపుపై రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్నా పంటలకు కనీస మద్దతు ధర పెంచలేదు. ఈజీఎస్‌కు సరిపడా నిధులు కేటాయించలేదు. పట్టణ ఉపాధిహామీ పథకాన్ని ఎందుకు మరిచిపోయారు. ఇది బీజేపీ నేతల, బీహార్ రాష్ట్ర బడ్జెట్‌లా ఉంది. – ఆనంద్‌కుమార్, కార్మిక సంఘం, జిల్లా కన్వీనర్

ధనికులకే ప్రయోజనం



ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర బడ్జెట్ దేశ ప్రజలను ప్రమాదంలోకి పడేస్తుంది. అభివృద్ధి, సమగ్ర ప్రజా సంక్షేమం లక్ష్యంగా ఉండాల్సింది పోయి ధనికుల ప్రయోజనాలను రక్షించేలా ఉంది. తక్షణమే విధానాలను పునసమీక్షించుకోవాలి. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించేందుకు, సామాజిక న్యాయం కోసం పోరాడేందుకు ముందుకు రావాలి.

– దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

పఠనాసక్తిని పెంచాలి



విద్యార్థులను అభినందిస్తున్న యాదయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని డీఈవో యాదయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి రీడతాన్ పఠన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే విద్యార్థులు కథలు, నీతి కథలు, నూతన ఆవిష్కరణల పుస్తకాలు చదివితే మేధస్సు పెరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి 300 చొప్పున పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. 47 స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి 94 మంది కాంప్లెక్స్ స్థాయి రీడతాన్ పఠన పోటీల విజేతలు జిల్లా స్థాయి పోటీలకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల పఠన సామర్థ్యం ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించినట్లు పేర్కొన్నారు.

విజేతలు వీరే..

జిల్లా స్థాయి పోటీల్లో తెలుగు మాధ్యమంలో సంజన (ఎంపీయూపీఎస్‌సీ, చిన్నరాస్‌పల్లి) ప్రథమ, జోగేశ్ (ఎంపీపీఎస్, తుమ్మలగుడ, బెజ్జూర్) ద్వితీయ, మహేశ్వరి (యూపీఎస్, కౌటి, కౌటాల) తృతీయ, ఆంగ్ల మాధ్యమంలో సాయి హంషిత్ (ఎంపీఎస్, కోయగుడ) ప్రథమ, అనిల్ (ఎంపీపీఎస్, సర్‌సిల్క్) ద్వితీయ, చైతన్య (ఎంపీపీఎస్, వంకులం, రెబ్బెన) తృతీయ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, బీఈడీ కళాశాల కరస్పాండెంట్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు



మాట్లాడుతున్న మహేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: బాలల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణాధికారి మహేశ్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాల రక్షభవన్‌లో జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి బాలల హక్కుల సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేసి అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అంకితభావంతో పని చేయాలని సూచించారు. సిబ్బంది ప్రవీణ్‌కుమార్, శ్రవణ్, శ్రీనివాస్, జమున, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్‌తివారి, డేవిడ్


- రాష్ట్ర సీఈవో సుదర్శన్‌రెడ్డి
- వీసీలో అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉమ్మడి నల్లొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. 24 గంటలు, 48 గంటలు, 78 గంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై రిపోర్ట్ అందించాలని తెలిపారు. రాజకీయ పార్టీల హోర్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని ఆదేశించారు. ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదలవుతుందని, 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13లోపు ఉపసంహరణ, ఈ నెల 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు ఉంటాయని తెలిపారు. తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, పెండింగ్‌లో ఉన్న టీచర్లు, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఫిబ్రవరి 7లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాలో ఎంసీఎంసీ కమిటీలు ఏర్పాటు చేసి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రసారాలను పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. జిల్లాలో 6,513 మంది ఓటర్లుండగా, 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

తడబడుతున్నారు..!

అక్షరాలు.. చదవలేకపోతున్నారు

- 'సర్కారు' విద్యార్థుల్లో మెరుగుపడని సామర్థ్యాలు
- ప్రాథమిక స్థాయిలో 16.5 శాతం మాత్రమే ఓకే
- 6 నుంచి 8తరగతుల్లో 50శాతం మించని వైనం
- 14 ఏళ్లలోపు వారిలో 73.8 శాతమే నయం
- 'అసర్' నివేదికలో ఉమ్మడి జిల్లా పరిస్థితి



పాఠశాలల స్థితిగతులను వెల్లడించిన అసర్ సర్వే నివేదిక

ఆదిలాబాద్‌టౌన్: చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యాపరంగా వెనుకబడే ఉంటుంది. అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కానరావడం లేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. మౌలిక వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత, ఉన్న వారిలోనూ కొందరు తరచూ గైర్హాజరు కావడం, సక్రమంగా బోధన చేయకపోవడం, అలాగే తల్లిదండ్రుల నిరక్షరాస్యత వంటి అనేక కారణాలు విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతున్నాయి. సర్కారు బడుల్లో చదివేదంతా పేద విద్యార్థులే. అభ్యసన సామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 3నుంచి 5వ తరగతి చదివే విద్యార్థుల్లో కేవలం 16.5 శాతం మందే అక్షరాలు చదవగలుగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాగే 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల్లో 50శాతం మాత్రమే పాఠాలు చదువుతున్నారు. 47.6శాతం మంది మాత్రమే తీసివేతలు చేస్తున్నారు. కేవలం 37.3 శాతం మాత్రమే భాగాహారం చేస్తుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో విద్యాసామర్థ్యాలపై రెండు నెలల క్రితం అసర్ సర్వే చేపట్టారు. ఈ నివేదికను ఇటీవల వెల్లడించగా అందులో అంశాలు విద్యాశాఖ పనితీరును తేటతెల్లం చేస్తోంది.

చదువులు అంతంతే...

సర్కారు బడుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. అలాగే ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులను కూడా నిర్వహించింది. ఇదంతా బాగానే ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక విద్యావ్యవస్థ మాత్రం దయనీయంగా మారడం గమనార్హం. రెండేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం యాన్యువల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు (అసర్) చేపడుతోంది. ఇందులో భాగంగా గతేడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని 15 గ్రామాల్లోని పాఠశాలలను, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కలిపి మరో 15 పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్, డైట్ కళాశాలల్లో చదువుతున్న ఛాత్రోపాధ్యాయుల ద్వారా ప్రథమ్ ఎడ్యుకేషన్ సంస్థ ఈ సర్వే చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 262 పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించారు. జనవరి 28న ఢిల్లీలో నివేదికను వెల్లడించారు. ఇందులో ఉమ్మడి జిల్లా పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉంది. అయితే విద్యార్థుల చదువులు వెనుకబాటుకు కొంతమంది ఉపాధ్యాయుల పనితీరే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు చిట్టీలు నడపడం, రియల్ ఎస్టేట్ దందాలు చేపట్టడం, సమయానికి బడికి రాకపోవడం, వచ్చిన పనివేళలకు ముందే ఇంటి దారి పట్టడం, పాఠశాలకు వచ్చినా సక్రమంగా పాఠాలు చెప్పకపోవడం, వంతుల వారీగా విధులు నిర్వహించడం, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం తదితర కారణాలతో సరైన బోధన జరగక విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకబడిపోతున్నట్లుగా తెలుస్తోంది.

మౌలిక వసతుల పరంగా..
ఉమ్మడి జిల్లాలో 16 శాతం పాఠశాలల్లో తాగునీటి వసతి లేదు. 31 శాతం పాఠశాలల్లో నీటి వసతి ఉన్నా అవి తాగడానికి ఉపయోగకరంగా లేవని అసర్ నివేదికలో వెల్లడైంది.

- 5.4 శాతం పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 18.9 పాఠశాలల్లో ఉన్నప్పటికీ నీటి వసతి, ఇతర కారణాలతో వాటిని వినియోగించడం లేనట్లుగా తేలింది. అలాగే 9.2శాతం పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవని సర్వేలో వెల్లడైంది.
- ఇక 13.9 శాతం పాఠశాలల్లో లైబ్రరీలు లేవని, 29.9 శాతం పాఠశాలల్లో గ్రంథాలయాలు ఉన్నప్పటికీ వాటిలో పుస్తకాలు లేవని సర్వే నివేదిక స్పష్టం చేసింది.
- 98.1శాతం పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం ఉండగా ఇందులో 96 శాతం పాఠశాలల్లో వినియోగిస్తున్నట్లు సర్వే గణాంకాలు చెబుతున్నాయి.
- కంప్యూటర్ విద్యాపరంగా 91.1శాతం పాఠశాలల్లో అసలే కంప్యూటర్లే లేవని సర్వేలో వెల్లడైంది. 5.1 శాతం పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్నా విద్యాబోధన సాగడం లేదని, కేవలం 3.8 శాతం పాఠశాలల్లో మాత్రమే కంప్యూటర్ బోధిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.

జాతర ఘనంగా నిర్వహించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 11నుంచి 13వరకు నిర్వహించనున్న జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అన్ని శాఖల అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయాలని సూచించారు. శాఖల వారీగా చేయాల్సిన పనులు, కల్పించాల్సిన వసతుల గురించి వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించి బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. డీపీవో భిక్షపతిగౌడ్, సింగరేణి ఎస్వోటూ జీఎం రాజమల్లు, డీఎంహెచ్‌వో సీతారాం, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, సీఐలు స్వామి, రాణాప్రతాప్, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, ఎంపీవో వాసుదేవ్, డీఈఈ రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న వెంకటేశ్‌దోత్రే

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు

దహెగాం: మండలంలోని మర్రిపల్లి, కమ్మర్‌పల్లి, కల్వాడ, దేవులగూడ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై శనివారం ఉదయం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సురేష్ తెలిపారు. అనంతరం మత్తు పదార్థాల నిర్మూలనపై మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గంగారెడ్డి, అక్బర్ హుస్సేన్, సిబ్బంది రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక గాజుల్‌పేట్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి శనివారం గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి యంత్రాన్ని పగులగొట్టి నగదు చోరీకి యత్నించాడు. పూర్తిగా తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న బ్యాంక్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీసీ కెమెరాను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్లు

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి శివారు లోగల గోదావరినది నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ మల్లేశ్ తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు మండలంలోని రెవెన్యూ అధికారులను మూడు బృందాలుగా విభజించి గ్రామాల్లో ఇసుక తవ్వకాలపై తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో సీజ్ చేసిన ఇసుక డంపులకు త్వరలో వేలం నిర్వహిస్తామన్నారు.

చింతపల్లిలో చిరుత సంచారం



చెట్టుపై చిరుతపులి

తిర్యాణి: మండలంలోని చింతపల్లి గ్రామ శివారులోని అటవీప్రాంతంలో శనివారం చిరుతపులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లిన సమయంలో చెట్టుపై ఉన్న చిరుతపులిని చూసి వీడియోలు తీశారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా సిబ్బందిని అటవీ ప్రాంతంలోకి పంపించి చిరుత కాలిముద్రలు సేకరించామన్నారు. గ్రామస్తులెవరూ అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని అవగాహన కల్పించామన్నారు.

బేతల్ పూజలు

- ముగిసిన మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- ఈ నెల 4 వరకు కొనసాగనున్న నాగోబా జాతర

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని జనవరి 28న మహాపూజతో నాగోబా జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు శనివారం బేతల్ పూజలతో సంప్రదాయ పూజలు ముగించారు. అంతకు ముందు సంప్రదాయ వాయిద్యాల మధ్య గోవాడ్ ముఖద్వారం వద్ద మెస్రం మహిళలు మెస్రం వంశ పెద్దల కాళ్లు కడిగి బేతల్ పూజలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులకు కానుకలు అందించారు. మెస్రం వంశ పెద్దలు వెదురు కర్ర పట్టుకుని బేతల్ నృత్యం చేయగా మెస్రం వంశీయులు, మెస్రం మహిళలు, కొత్త కోడళ్లు సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులు నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగించారు. సతీదేవత, భాన్‌దేవత ఆలయాల్లో కొత్త కోడళ్లు, భక్తులు వేసిన కానుకలు (రూ.78,875), ప్యాలాలను 22 కితల వారీగా పంపిణీ చేశారు. మహాపూజలకు తీసుకువచ్చిన కొత్త కుండలను కితల వారీగా పంపిణీ చేశారు. ఏడాదిపాటు కుండలకు పూజలు చేయాలని సూచించారు. అనంతరం మెస్రం వంశీయులు రాత్రి ఉట్నూర్ మండలం శ్యాంపూర్‌లోని బుడుందేవ్ ఆలయానికి బయలుదేరారు. ఈ నెల 3న తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశం పెద్దలు తెలిపారు.



మైసమ్మ దేవతకు మొక్కుతున్న భక్తులు

జనసంద్రమైన కేస్లాపూర్

కేస్లాపూర్‌లోని నాగోబా జాతరకు శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి నాగోబాను దర్శించుకున్నారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద సామగ్రి కొనుగోలు చేశారు. రంగులరాట్నాల వద్ద యువతీ యువకులు, చిన్నారుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. ఈ నెల 4 వరకు అధికారికంగా, మరో రెండు రోజులు అనధికారికంగా జాతర కొనసాగనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.



నాగోబాకు మొక్కుతున్న మెస్రం వంశీయులు



కుండలు అప్పగిస్తున్న మెస్రం వంశీయులు



బేతల్ నృత్యం చేస్తున్న మెస్రం తిరుపతి

సింగరేణి కార్మికులకు ఊరట



- ఆదాయపన్ను స్లాబ్ పెరుగుదలతో మేలు
- మాఫీపై మరో'సారీ'

శ్రీరాంపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సింగరేణి కార్మికులకు కాస్త ఊరటనిచ్చింది. ఆదాయ పన్ను స్లాబ్ పెరుగుదల కార్మికులకు ఆర్థికంగా మేలు చేయనుంది. రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్ను లేకపోవడంతో జూనియర్ కార్మికులకు మేలు జరుగనుంది. ఇటీవల సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు, ఎక్స్‌ట్రనల్ నోటిఫికేషన్ల ద్వారా వేలాది మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరారు. వీరంతా కూడా రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయం పొందుతారు. పాత ఆదాయ పన్ను స్లాబ్ ప్రకారం రూ.6 లక్షలు దాటిన వారు కూడా ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉండేది. కానీ నేడు ఈ బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు కూడా పన్ను లేకపోవడంతో కార్మికులకు ఆర్థికంగా మేలు జరుగనుంది. దీని వల్ల కంపెనీ వ్యాప్తంగా సుమారు 15 వేల మంది కార్మికులకు మేలు జరుగనుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉంటే బొగ్గు పరిశ్రమను రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఆదాయ పన్ను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రతీ ఎన్నికలకు ముందు ఇది ప్రచార అస్త్రంగా నిలుస్తోంది. ఈ సారైనా మాఫీ లేదా, మరింత ప్రత్యేక రాయితీ ఇస్తారని ఆశించిన కార్మికులకు నిరాశే మిగిలిందని పెదవి విరుస్తున్నారు.

జూనియర్లకు మేలు



రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను లేకపోవడంతో జూనియర్ కార్మికులకు మేలు జరుగనుంది. బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. కానీ బొగ్గు పరిశ్రమకు ఊతమిచ్చే మరే ప్రకటన కూడా కేంద్ర బడ్జెట్‌లో లేకపోవడం నిరుత్సాహ పరిచింది.

– ఎస్కే బాజీసైదా, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

నిరాశే మిగిలింది



బొగ్గు గని కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేయాలని అనేక ఏళ్లుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈసారి బడ్జెట్‌లో కూడా నిరాశే మిగిలింది. కనీసం బడ్జెట్‌లో పన్ను రహిత ఐటీ స్లాబ్ పెరగడంతో నైనా కాస్తా మేలు జరుగనుంది.

– కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

కులబహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

దహెగాం: తమను కులబహిష్కరణ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఇట్యాలకు చెందిన గంగపుత్రులు శనివారం తహసీల్దార్ కవిత, ఎస్సై రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం గ్రామంలో ఓ వర్గానికి(దళిత) చెందిన ఇంట్లో శుభకార్యం ఉంటే వెళ్లగా కులపెద్దలు పంచాయితీ నిర్వహించి ఎనిమిది కుటుంబాల ను కుల బహిష్కరణ చేశారన్నారు. దీంతో తమను పశువుల కంటే హీనంగా చూస్తున్నారన్నారు. రాటి వెంకటి, బక్కయ్య, మల్లయ్య, కిషన్, గణపతి, ఇ స్తారి, రవీందర్, రాటి తిరుపతి పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం'

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేసిందని విమర్శించారు. రూ.50,65,345 కోట్ల బడ్జెట్‌లో దేశ గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా 7 శాతం అనగా రూ.3,54,574 కోట్లు గిరిజన సబ్‌ప్లాన్‌కు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజనులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఉపాధి రంగాల్లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

సోన్: మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జాఫ్రపూర్‌లో శనివారం చోటు చేసుకుంది.. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాఫ్రపూర్ గ్రామానికి చెందిన బొద్దుకూరి రాంరెడ్డి (63) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి బాత్రూంకు వెళ్లాడు. బాత్రూంలో ఉన్న క్లీనర్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఖానాపూర్: గత నెల 27న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పెంబి ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పెంబి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ మండలం బావాపూర్ (ఆర్) గ్రామానికి చెందిన మల్లేశ్ (21) రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జైనథ్ ఆలయంలో జడ్జీల ప్రత్యేక పూజలు



ఆలయ ఆవరణలో జడ్జీలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలువురు జడ్జీలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో బెల్లంపల్లి, నిర్మల్ సివిల్ జడ్జీలు మహేష్, శ్రీనివాస్, సంపత్, అరుణ, అజయ్ కుమార్, ఆదిలాబాద్ రెండో అడిషనల్ జడ్జి హుస్సేన్ ఉన్నారు. వారి వెంట జైనథ్ ఎస్సై పురుషోత్తం , ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోవర్ధన్



గోవర్ధన్

బోథ్: ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బోథ్ మండల కేంద్రానికి చెందిన భారతాల గోవర్ధన్ ఎన్నికయ్యారు. కోరుట్లలో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ వర్కర్ల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జన్నారం: డివిజన్‌లోని తపాలపూర్ అటవీ చెక్‌పోస్ట్ వద్ద జన్నారంకు చెందిన మోబిన్‌ను కొట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి రమాదేవి, ఫారెస్ట్ బీట్ అధికారి రవి, డ్రైవర్ పోతన్నపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. గత నెల 28న జన్నారం నుంచి లక్సెట్టిపేటకు వెళ్తున్న తనను చెక్‌పోస్టు వద్ద ఆపి సెల్‌ఫోన్ లాక్కుని కొట్టారని మోబిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిజామాబాద్ సదస్సులో ట్రిపుల్ఐటీ విద్యార్థులు



సదస్సులో ట్రిపుల్ఐటీ విద్యార్థులు

భైంసా: నిజామాబాద్‌లో శనివారం నిర్వహించిన డెవలప్‌మెంట్ డైలాగ్ సదస్సులో బాసర ట్రిపుల్ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. 50 మంది విద్యార్థుల బృందం పాల్గొని మూడు స్టార్టప్‌లను ప్రదర్శించారు. డ్రోన్‌టెక్నాలజీ, ప్రస్తుతం మార్కెట్ ట్రెండ్‌లపై విద్యార్థులు తమ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏవో రణధీర్‌సాగి, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం

కాసిపేట: కేస్లాపూర్‌లోని నాగోబా జాతరలో నాలుగు రోజులపాటు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మండలంలోని దేవాపూర్ జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోంది. పోటీల్లో మొత్తం 72 జట్లు పాల్గొనగా దేవాపూర్ జట్టు ఫైనల్స్‌లో మత్తడి టీంతో హోరాహోరిగా తలపడి విజయం సాధించింది.

వసంత పంచమి వేడుకలు షురూ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: చదువుల తల్లి కొలువైన బాసరలో శనివారం వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ వైదికబృందం ఆధ్వర్యంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గోమాతకు పూజలు చేశారు. అనంతరం యాగశాలలో హోమ పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. సరస్వతీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు పూజలు చేశారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తుల పూజలు

బాసర వచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో పుణ్యస్నానం ఆచరించి సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించి సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, గోదావరి ఘాట్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలు మరో రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

బాసరలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

భైంసా: బాసర గోదావరి నదీ తీరంలో శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ శ్రేణులతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదని ఆరోపించిన ఎమ్మెల్యే స్వచ్ఛభారత్‌కు పిలుపునిచ్చారు. నదీతీరంలో పూజా వ్యర్థాలు, నదిలో పారేసిన గుడ్డలు, చెత్తాచెదారం, ముళ్లపొదలు తొలగించారు. రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ జేసీబీలతో స్నానఘట్టాలపై పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ స్వచ్ఛభారత్‌కు పిలుపునివ్వగానే మరోవైపు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయమే సమీప ప్రాంతాల్లోని పంచాయతీ సిబ్బందిని బాసరకు పిలిపించారు. ఎమ్మెల్యే రాకముందే శుభ్రత పనులు ప్రారంభించారు. ఒకవైపు పంచాయతీ సిబ్బంది, మరోవైపు బీజేపీ శ్రేణులు స్నానఘట్టాలను శుభ్రం చేశారు.

బ్యాటరీల చోరీ నిందితుల అరెస్టు



అరెస్టు చూపిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

బెల్లంపల్లి: రైల్వే శాఖకు చెందిన ఎలక్ట్రికల్ బ్యాకప్ బ్యాటరీల చోరీ కేసును రైల్వే పోలీసులు ఛేదించారు. శనివారం బెల్లంపల్లి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. తాండూర్ మండలం రేచీని రోడ్-ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఉన్న రేపల్లెవాడ శివారు రైల్వే ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు బ్యాకప్ బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. బెల్లంపల్లి, రామగుండం ఆర్‌పీఎఫ్ ఎస్సైలు నరేందర్, క్రాంతికుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. తాండూర్ మండలం కిష్టంపేటకు చెందిన మోటం శ్రీను, టి.మహేష్‌ను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 55 బ్యాటరీలు, ఓమినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మాయమాటలు చెప్పి బంగారం అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: లాటరీ తగిలిందని మాయమాటలు చెప్పి ఓ మహిళ వద్ద నుంచి రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన అనసూయ శనివారం ఉదయం కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి వాటర్ క్యూరింగ్ చేస్తుండగా అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి తన భర్త పేరు చెప్పి ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ కొనుగోలు చేసినందుకు లక్కీ కూపన్ వచ్చిందని చెప్పాడు. ఆ కూపన్ ద్వారా టీవీ, రిఫ్రిజిరేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకునే అవకాశం ఉందని, ఇష్టం లేకపోతే వస్తువులకు బదులు రూ.లక్ష తీసుకోవచ్చన్నాడు. అతని మాటలు నమ్మడంతో షాపు వద్దకు రమ్మని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. పట్టణంలోని పంజేషా మొహల్లా కాలనీలో రెండు సిమెంట్ షాపులను చూపించాడు. అందులో మూసి ఉన్న షాపు తమదని నమ్మబలికాడు. బహుమతులు అందించిన నిర్వాహకులకు బంగారం చూపించాలని ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారాన్ని తీసుకెళ్లాడు. మూసి ఉన్న షాపు తెరిచిన తర్వాత విషయాన్ని ఆ షాప్ యజమానికి చెప్పడంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశాడు. ఒక్కసారిగా కంగు తిన్న ఆమె మోసపోయానని గ్రహించి కన్నీరు మున్నీరయ్యింది. కుటుంబ సభ్యులకు చెప్పడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలో పరిశీలించగా నిందితుడు పల్సర్ బైక్‌పై వచ్చాడని, నల్లని టీ షర్టు, టోపీ ధరించినట్లు గుర్తించామని వివరించారు.

మాయచేశాడు.. నగలు దోచేశాడు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలికి మాయమాటలు చెప్పి నగలు అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం చెన్నూర్‌కు చెందిన గద్దె సమ్మక్క గత నెల 30న ఆసిఫాబాద్ వెళ్లేందుకు మంచిర్యాల బస్టాండ్‌లో కూర్చుంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బంగారం ముద్ద అనిచెప్పి ఓపేపర్ చేతిలో పెట్టాడు. దీంతో ఆమె మతిస్థిమితం కోల్పోయి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు ఇచ్చేసింది. వెంటనే సదరు వ్యక్తి అక్కడి నుంచి ఉడాయించాడు. ఇంటికి వెళ్లాక విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు ఓ గుర్తు తెలియని వ్యక్తిని కనిపెట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరు..

భైంసాటౌన్: మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై మహమ్మద్‌గౌస్ తెలిపారు. పట్టణంలోని గుజిరిగల్లికి చెందిన జాదవ్ గణేశ్ (27) లేబర్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం భట్టిగల్లిలోని మున్నూరుకాపు సంఘం భవనం వద్ద కిందపడి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మద్యం మత్తులో కిందపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య



రాజేందర్ (ఫైల్)

భైంసారూరల్: ఒంటరితనం భరించలేక ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ఆది రాజేందర్ (37)కు ఆరేళ్ల క్రితం భార్యతో విడాకులయ్యాయి. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. ఒంటరితనం భరించలేక మానసికంగా కృంగిపోయాడు. శుక్రవారం రాత్రి ఇంటిముందున్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్..



సాయికుమార్ (ఫైల్)

శ్రీరాంపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగార్జున కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన గోనె సాయికుమార్ (35) భార్య పద్మకు జ్వరం రావడంతో ఈ నెల 30న మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేయించాడు. అదేరోజు సాయంత్రం ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి వరకూ రాకపోవడంతో పాటు భార్య ఫోన్ చేసినా ఎత్తలేదు. 31న ఉదయం కూడా ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో విషయాన్ని పద్మ సోదరుడు మల్లేశ్‌కు తెలిపింది. అతను రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి లోపల గడియపెట్టి ఉంది. పిలిచినా పలకకపోవడంతో కిటికీలోంచి తొంగిచూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో శనివారం ఉదయం మృతదేహాన్ని కిందికి దించారు. ఆటో కిరాయిలు లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని బావమరిది మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి



డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.



కేలా రెనెకె · నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాన్ని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకె కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు. సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా




● 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ-''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.



● 'తంగలాన్'లో విక్రమ్



● 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్



● కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమెరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్



● విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ-''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్



● ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....




● ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండితెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

- ఇంటూరు హరికృష్ణ